


# ఈ కథ కంచికి పోదు!

ఈ కథకు మీడియేటర్ నవవలసివస్తుందని అనుకోలేదండి. అయినా తప్పలేదు మరి!

ఉద్యోగికి దూరభూమి లేదంటారు. నిజమే. కాని తూర్పు నుండి పడమరకి విసిరి వారం రోజుల్లో వెళ్ళి చేరాలంటే ఎవరికైనా కష్టమే. కొత్త వూరు, కొత్త వాతావరణం అని భయం. కాని రెక్కల మీద బ్రతికే నా లాంటి వారికి తప్పదు.

నేను వెళ్ళినచోట ఆఫీసరు మంచివాడు కావటం నా అదృష్టం. మాసిన బట్టలతో, జిడ్డుకారుతున్న ముఖంతో, కొంచెంగా పెరిగిన గడ్డంతో చెదిరిన జుట్టుతో రైలు దిగి సరాసరి ఆఫీసుకు వెళ్లాను. నన్ను చూసి ఆయన జాలిపడ్డాడు. అప్పుడే గౌరీపతిని పరిచయం చేశాడు.

"గౌరీపతిగారు, వీరు మూర్తిగారు. మన ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు. ఆయనకి గది దొరికేదాకా మీ గదిలో ఉంటారు. ఏం? మీ కేమైనా అభ్యంతరమా?"

గౌరీపతి నవ్వాడు.

"ఏమీ అభ్యంతరం లేదు. పైగా ఆనందం కూడాను. రండి!" అన్నాడు.

"థాంక్స్" అన్నాను.

నా కతనిలో అందమైన హృదయం కనిపించింది.

ఆ సాయంకాలం మా హెడ్ క్లర్కు మాధవరావుతో పరిచయమైంది.

"చాలా దూరంనుంచి వచ్చారే? గది దొరికిందా?" అన్నాడు.

"ప్రస్తుతానికి గౌరీపతిగారి గదిలో ఉంటున్నాను."

మాధవరావు అదోలా నవ్వాడు.

"ఓ, మోహినీపతితోనా? జాగ్రత్తం దోయ్."

ఆ 'జాగ్రత్త'కి అర్థం నాకు తెలీదు. అడిగే చనువులేదు. ఇది గౌరీపతిని గురించి విన్న మొదటి వ్యాఖ్య.

"మోహినీపతా?" అన్నాను ఆశ్చర్యంతో.

మాధవరావు జవాబుగా తిరిగి అదోలా నవ్వాడు.

ఈ వూళ్ళో విశ్వం, గౌరీపతి అనే ఇద్దరు వ్యక్తులున్నారు. వారిద్దరిని గురించి ఈ వూళ్ళో ఎన్నో కథలు ప్రచారంలో వున్నాయి. ఇంతకు వారిద్దరు ఆప్తమిత్రులు. ఇదేనేమొ వారు చేసిన అపరాధం?

ఎక్కడ, ఎప్పుడు, చూసినా విశ్వం పక్కన గౌరీపతి కనపడేవాడు. గౌరీపతి ఆఫీసులో లేకపోతే అతని కేరాఫ్ అడ్రసు విశ్వం ఇల్లేనని పోస్టుమాన్‌కి కూడా తెలుసు. ఈ కారణంవల్ల కొందరు గౌరీపతిని విశ్వం రెండవ భార్యగా మారు పేరు పెట్టేశారు. దానికి తగినట్లు సాధారణంగా రెండో భార్య మీద ఎంత ఆపేక్ష, మమకారం చూపిస్తారో అంతకన్నా ఎక్కువ చూపేవాడు విశ్వం.

ఇక మాధవరావుగారి దృష్టిలో విశ్వం గౌరీపతిని హిప్నటైజ్ చేస్తున్నాడని. ఆయన దృష్టిలో ఇంతకన్నా గొప్ప సత్యం వేరేలేదు. విశ్వానికి హిప్నాటిజం తెలుసనిగాని, గౌరీపతిని హిప్నటైజ్ చేస్తున్నాడనిగాని నేను నమ్మలేకపోయాను. నాకు వారిద్దరు పరిపూర్ణమైన వ్యక్తులుగానే కనపడ్డారు. వారిద్దరిమధ్య స్నేహం అనే బలమైన ఉక్కువంతెన ఉన్నది. నిజానికి సృష్టిలో తీయనిది స్నేహమేగదా. అయినా అతన్ని హిప్నటైజ్ చేస్తే విశ్వానికి వచ్చేదేమిటి? గౌరీపతిలో అందంవుంది, ఆకర్షణ వుంది. అంతే. అవే అతని ఆస్తి. నాలాగే రెక్కలమీద ఆధారం.

వీటన్నిటిని మించి మాధవరావు అంతరాత్మ చెప్పే వెర్షను వేరేవుంది. విశ్వానికి మోహిని అనే చెల్లెలువుంది, గౌరీపతికి ఆమెకి ఏదో సంబంధం వున్నదని ఆ అంతరాత్మ ఉవాచ. అయితే అవచ్చు కాని ఆమె వితంతువు! ఆయన అంతరాత్మ దృష్టిలో అది అవినీతి. నిజం నిప్పులాంటిది. నిప్పు లేకుండా పొగ రానిమాట కూడ నిజమే. కాని నేను వీటిని దృష్టిలో పెట్టుకుని గౌరీపతిని అనుమానించలేకపోయాను. నాకు అతని ప్రవర్తన స్ఫటికంలా అతి స్వచ్ఛంగా నిర్మలంగా కనిపించింది. అసలు వాళ్ళిద్దరే ఈ కథలకు ఏమీ ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఒకవేళ గౌరీపతికి మోహినితో అలాంటి అక్రమ సంబంధమే వుంటే విశ్వం ఎందుకూరుకుంటాడు? లేదా, అది విశ్వానికి ఇష్టమయ్యే ఉండాలి. అటువంటప్పుడు సంఘం ఈ విషయాన్ని పట్టించుకోవడం అనవసరం. విశ్వానికి, వారిద్దరికి వివాహం చేయాలనే ఉద్దేశ్యం ఉండవచ్చు. తప్పేమిటి?

ఒక రాత్రి భోజనం చేసివచ్చి ఏం తోచక గౌరీపతి షెల్ఫ్ లోంచి ఒక పుస్తకం తీసుకున్నాను. అది గీతాంజలి. మొదటి పేజీ తిప్పి నిర్ఘాంతపోయాను. మనసులో ఎవరో చేయిపెట్టి కెలికినట్లయింది. దానిమీద "గౌరీపతి అన్నయ్యకు మోహిని" అనివుంది. నా హృదయం ఎంతో అనుభూతితో నిండిపోయింది. పదే పదే ఆ వాక్యాన్ని చదువుకున్నాను.

శిలాంటి వ్యక్తుల్ని సంఘం ఎలా నీచంగా అనుమానిస్తుంది? స్త్రీ పురుషుల మధ్య స్నేహం ఉండకూడదా?

గౌరీపతి నాకు విశ్వాన్ని, మోహినిని కూడా పరిచయం చేశాడు. మోహిని ఒక విషాద చరిత్రకు ప్రతిరూపంలా వుంది.

"మోహిని, చిత్రకారిణి తెలుసా?" అన్నాడు గౌరీపతి. ఆమె వేసిన చిత్రాలు చూపిస్తూ. వాటిని చూస్తుంటే ఆమె కళలో ఎంత తాదాత్మ్యం చెందిందో అనిపించింది.

"మీకు నమ్మరేమో మూర్తిగారు, నేను గౌరీపతికి ఎంతో ఋణపడి వున్నాను. నా దుఃఖాన్ని పోగొట్టి నాలోని చిత్రకళను పైకి తెచ్చాడు. లేకపోతే నేనేమైపోయేదాన్నో?" అంది మోహిని.

జీవితంలో కొందరు శాపగ్రస్తులవుతుంటారండి. ఎవరో ఒక వ్యక్తి శాపవిమోచనం చేసినట్లు వారిలోని కళను పైకి తీసుకువస్తాడు. మోహినిలో ఆ కళను నా కంటే ముందుగా గుర్తించాడు గౌరి."

ఒక్కసారి నా మనస్సులో గింగురుమన్నాయి. ఆనాడు మోహిని నా కళ్ళకి "పెయింట్"లా కనిపించింది. ఆమెలో ఒక సాధన, తపస్సు, ఏదో సాధించాలనే ఆకాంక్ష వున్నాయి. ఆమెది హృదయగత సౌందర్యం.

మోహిని అంది.

"ప్రతివస్తువు కొత్తప్రాణంతో సౌందర్యంతో, కొత్త కోణంలో కనిపిస్తుంది. అదంతా చిత్రించాలని నా తాపత్రయం. విశ్వవ్యాప్తమైన ప్రేమ భావాన్ని చిత్రించాలని ఏదో వేదన, దానికి స్త్రీ పురుష వివక్షతలేదు. అది కూడ అన్వేషణ. నన్ను ప్రోత్సహించి, దారి చూపినవాడు గౌరీపతి. అతని ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను."

ఈ మోహిని నెవరు అనుమానించగలరు?

మాధవరావులాంటి వారి భావాలు క్షుద్రమైనవి. వారి హృదయము అంతే. అసలు ఎన్నో సంవత్సరాలుగా సంఘం ఒక మూలగా కుళ్ళిపోతున్నది. అందుకే మాధవరావు మాటలను నేను గ్రహించలేదు. విశ్వం, గౌరీపతి ఒకర్నొకరు గాఢంగా నమ్ముతారు. ఒకరికోసరం ఒకరు ప్రాణాలైనా ఇస్తారు. ఇందుకు అనేక దృష్టాంతాలు కనపడినయి.

ఒకరోజు ఉదయం నేను నిద్రలేచేసరికి విశ్వం వాకిట్లో ఉన్నాడు.

"హలో, ఏమిటి ఇలా వచ్చారు?" అన్నాను.

"ఓ, మీరా, గౌరి ఇంకా నిద్రలేవలేదా?" అన్నాడు.

"పిలుస్తానుండండి" అని లోపలికివెళ్ళి అతన్ని నిదలేపాను.

నేను పెరట్లో ముఖం కడుక్కుంటుంటే వారిద్దరి మాటలు వినబడుతున్నాయి.

"అనుకోకుండానే కేంప్‌కి వెళ్ళవలసి వచ్చింది గౌరి. తెలుసుగా, కాస్త తోడు వెళ్ళి పడుకుంటావుగా." అది విశ్వం గొంతు.



ర చ యి త

గౌరీపతి చిన్నగా నవ్వాడు.

ఆ రోజు సాయంకాలం మాధవరావు పోరుపడలేక సినిమాకి వెళ్ళాము. డబ్బిచ్చి తలనొప్పి కొని తెచ్చుకుని, రాత్రి పది గంటలప్పుడు ఇంటికి తిరిగి పోతున్నాము. నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా నా చేయి పట్టుకుని ఆపాడు మాధవరావు.

"ఏమిటి?" అన్నాను.

"అదుగో చూశారా? మోహినిపతి వస్తున్నాడు. మోహిని కూడా ఉందండోయ్."

అందులో అంత ఆశ్చర్యం కలిగించేదేమిటో నా కర్థం కాలేదు.

గౌరీపతి, మోహిని రానే వచ్చారు.

"ఏమిటయ్యా 'నిశాచరుడి'లా - ఎక్కడికి పోతున్నావు?" ముసిముసి నవ్వులతో మాధవరావు ప్రశ్న.

"విశ్వం ఇంటికి."

"ఇంత, రాత్రిపూటా-?" మాధవరావు వ్యంగ్యం. గౌరీపతి ముఖంలో రంగులు మారాయి.

"పనుంది." అంటూనే వెళ్ళిపోయాడు.

"విన్నారా?" అన్నాడు మాధవరావు పోతున్న వాళ్ళిద్దరిని చూస్తూ.

"ఏమిటి?"

"అతని సంజాయిషి. తాడిచెట్టు ఎందుకెక్కావంటే దూడ మేత కన్నాడట. అలా వుంది."

"మన కతను సంజాయిషి చెప్పవలసిన అవసరమేమీ లేదే!"

"కావచ్చు. కాని మనం చూస్తూ ఊరుకోలేంగదా? లేకపోతే అర్ధరాత్రి పన్నెండు గంటలదాకా అక్కడ ఈయనకి పనేమిటి? మనమంతా స్నేహితులం కామా? ఇంత ఇది ఎక్కడైనా ఉందా?" నిజానికి విశ్వం ప్రొద్దున్న వచ్చి గౌరీపతిని పిలవటం నాకు తెలుసు. గౌరీపతిలో ఏ నమ్మకం లేనిది విశ్వం అతన్ని రమ్మని పిలుస్తాడు? అదీగాక నా మనస్సుకు నాకు గౌరీపతి - మోహినిమధ్య ఉన్న సంబంధం ఎంత నిర్మలమైనదో తెలుసు. అయితే వాదిస్తే రెచ్చిపోయే స్వభావం మాధవరావుది. అందుచేత అతను చెప్పిందంతా ఒక చెవితో విని మరో చెవితో వదిలేశాను.

మరునాడు ఉదయం ఏడింటికి గౌరీపతి వచ్చాడు.

"మూర్తి నా కోసం చిన్న సహాయం చేస్తారా?"

"ఏమిటి?"

"ఓ యాభై రూపాయలు సర్దగలరా?"

"నిన్ననేగా జీతం వచ్చింది. అప్పుడే అయిపోయిందా?"

"లేదుమూర్తీ, లీల పండక్కి చీర కావాలంది. విశ్వం జీతం ఇంకా రాలేదు అందుకని నా జీతం లీల కిచ్చేశాను."

"లీలంటే"

"విశ్వం భార్య."

"గౌరీపతి వంక ఆశ్చర్యంగా చూశాను.

మాధవరావయితే దీని చుట్టూ మరో కథ అల్లి ఉండేవాడు.

అతను ఇంత ఉపోద్ఘాతం చెప్పిన తరువాత ఇవ్వకపోతే బాగుండదు. అందుకని మెదలకుండా ఇచ్చేశాను.

గౌరీపతి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. కాని ఆ తరువాత తెలిసిన విషయం ఆ డబ్బు కూడ లీలకి ఒంట్లో బాగులేకపోతే వాడేశాడట. మళ్ళీ నన్ను మాత్రం అడగలేదు.

"డబ్బు లేదా? ఇబ్బంది పడుతున్నట్లున్నారే?" అన్నాను.

"కొంచెం ఇబ్బందిగానే వుంది."

"విశ్వం మీకివ్వవలసింది ఇవ్వలేదా?"

అతను ముఖం చిట్లించాడు.

"లేదు."

"మరి ఈ నెలంతా ఎల గడుపుతారు?"

"ఏమో? నేనాలోచించలేదు. కానీండి చూద్దాం." అన్నాడు చిరునవ్వుతో.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఇంత స్నేహం! దీన్ని గురించి చెప్పటానికి నా భాష చాలదు.

కాలం గడిచిన కొద్దీ నేనీ ప్రచారానికి అలవాటు పడిపోయాను. నాకీ వాతావరణం పాతబడిపోయింది. రోజు రోజు వారిని గురించిన నీలి వార్తలు ఎక్కువౌతూనే వున్నాయి. మా ఆఫీసే దానికి కేంద్రమైంది. ఆ మాటకు వస్తే నేనెన్నోసార్లు గౌరీపతిని మోహినిని, గౌరీపతిని లీలని కూడ తిరగటం చూశాను. అయితే నేనీ విషయాల్ని ఎవరితోను చెప్పదలుచుకోలేదు. ఆఫీసులో ఇప్పటికే "మూర్తి మడిగట్టుకు కూర్చుంటాడు." అన్న పేరు పడిపోయింది.

* * *


అదృష్టం వెనుక దురదృష్టం ఉంటుందనిపిస్తుంది!

విశ్వం గౌరీపతుల స్నేహాన్ని సంఘం చూడలేకపోయింది.

విశ్వానికి ట్రాన్స్‌ఫర్ అయింది!

ఆ రోజు విశ్వానికి వీడ్కోలు పార్టీ ఇచ్చారు. నాకు ఆహ్వానం వచ్చింది. మేమూ వెళ్ళాము.

ఆ రోజు చాలామంది ప్రసంగించారు.



ఆ ప్రసంగాలలో ఎక్కువ భాగం వాళ్ళ స్నేహాన్ని గురించే జరిగినయి. విశ్వం వెళ్ళిపోయిన తరువాత గౌరీపతి సంగతేమిటని కూడ కొందరు సందేహం వెలిబుచ్చారు. అసలు గౌరీపతే అన్నాడు:

"విశ్వం, - నీ స్నేహంలో వున్న నిజాయితీ, మాధుర్యం ఇతరుల కర్థం కావు. సృష్టిలో తీయనిది స్నేహమే నన్న మాట సత్యం. ఇప్పుడేకాదు, ఎప్పుడూ నేను నిన్ను ప్రేమిస్తాను."

అతని కంఠం వణికింది.

"సంఘానికి వేరే పనిలేదు. ఎప్పుడూ ఎవరిలోనో లోపం వెదుకుతూ వుంటుంది. మనిద్దరికి మధ్య వున్న సంబంధం అతి పవిత్రమైనది. అసలు నువ్వెవరన్న ప్రశ్న నాకు రానేలేదు! మొదటిరోజు నిన్ను చూసినప్పుడు నాకు ఉషోదయం అయింది. నా కళాత్మక హృదయం చిగిర్చింది. అందుకే ఆనందంలో నిండిన నా జ్ఞాపకాలు ఇక నా కన్నీటిలో తడిసి నన్ను వెక్కిరిస్తాయని నా భయం."

మాధవరావు జేబురుమాలు అడ్డు పెట్టుకుని నవ్వుకుంటున్నాడు. నేను గౌరీపతి వంక జాలిగా చూశాను. అతని గొంతులో జీర స్పష్టంగా పలుకుతున్నది.

"గడిచినదంతా కలఅనుకుని సంతృప్తి పడలేను. కారణం ఒకటే. నీ ప్రభావం నా జీవితాన్ని నింపేసింది. బహుశా ఎన్ని రోజులు గడిచినా నేను దాన్నుంచి కోలుకోలేను. నాకు మళ్ళీ నీలాంటి స్నేహితుడు దొరకడు. నాకు కావలసిన ఆనందాన్ని నువ్వే ఇచ్చావు. ఈ సంగతి నేను మరిచిపోను.

అతని ముఖం పగిలిన అద్దంలా అయింది.

"నాకెవ్వరు లేరు. అలాంటి నాకు నీ స్నేహం లభించింది. ప్రేమలోని మాధుర్యాన్ని నీ ద్వారా నేను తెలుసుకున్నాను. నేను ప్రేమించటానికే పుట్టాను. ఆ ప్రేమ నిర్వాణం పొందాలని తపస్సు చేశాను. మనిద్దరిమధ్య వున్న ప్రేమలో సత్యం, శివం, సుందరం మూడు వున్నాయి. అందుకే అది మిథ్య కాదు. చరిత్ర దాన్ని గుర్తించక పోయినా దాని విలువ దానికుంది."

అతని కళ్ళు మోహినిమీదికి తిరిగినయి. ఆ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అతను భారంగా కళ్ళు మూసుకుని తల దించుకున్నాడు. ఎవరిలోను చలనంలేదు. నిశ్శబ్దంగా అతన్నే చూస్తున్నారు.

"నిజానికి ప్రేమించటంకన్నా ప్రేమింపబడటం ఒక అదృష్టం. ఈ మహాప్రేమ ప్రవాహంలో చాలాదూరం కొట్టుకుపోయిన నా హృదయం తిరిగి కోలుకుని, నేను మామూలు మనుష్యులలో కలవటం కల్ల. అందుకే నీకు ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిసినప్పటినుంచి నాకు జీవితం మీద విరక్తి పుడుతోంది. ఈ వియోగం మృత్యువుకన్న భయంకరమైనది. కాని నేను చనిపోయినా మన ప్రేమకి మరణం లేదు."

మోహిని అక్కడ నిల్చోలేక లోపలికి వెళ్ళిపోయింది కన్నీరాపుకుంటూ.

"ఇదంతా మోహిని కన్వయంమూర్తి" మాధవరావు గుసగుసలాడాడు.

నాకు మాధవరావుమీద అసహ్యం వేసింది. కనీసం ఇప్పుడైనా అతను సీరియస్‌గా తీసుకోడేం?

గౌరీపతి ఇంకా ఏమిటో మాట్లాడబోయాడు. అతని పెదవులు వణికినయి, మాట్లాడలేక రెండు అరచేతులు అడ్డం పెట్టుకుని బావురుమన్నాడు.

చప్పున విశ్వం కూర్చున్న చోటునుంచి లేచాడు.

"ఏమిటి నీ పిచ్చి గౌరీ! ఈ వియోగం మన దేహాలకే. మనస్సులు ఎప్పుడో కలిసిపోయాయి. ఎందుకంత దిగులు - మన మూర్తిగారు వాళ్ళంతా ఉన్నారు. ఏం భయంలేదు. ఉత్తరాలు వ్రాస్తుంటాగా. ఛ! ఏడుస్తారా ఎక్కడైనా?"

"విశ్వం, ఇంతేలా విశ్వం!"

గౌరీపతి అతని గుండెలో తల దాచు

కున్నాడు. అతని కన్నీరుతో విశ్వం చొక్కా తడిసిపోయింది. విశ్వం అతన్ని పొదివి పట్టుకున్నాడు ఆప్యాయంగా.

నా కళ్ళు చెమర్చినయి.

మాధవరావిక ఆగలేకపోయాడు.

"విశ్వం, నీ వెంట గౌరీపతిని కూడా తీసుకువెళ్ళు. లేకపోతే నీ విరహంలో కృశించిపోతాడు." అని తన జోకికి తనే విరగబడి నవ్వాడు.

గౌరీపతి ముఖాన్ని దైన్యం ఆవరించింది.

ఈ సందర్భంలో ఒక శుభ వార్త ప్రకటించబడింది.

విశ్వం త్వరలో తండ్రి కాబోతున్నాడు!

ఈ మాట వినగానే అందరూ సంతోషించారు. నేను విశ్వాన్ని అభినందించాను. విశ్వం నవ్వాడు.

"థాంక్స్. ఏదో ఇన్నాళ్లికి ఆ భగవంతుకి దయ కలిగింది. కాని ఈ ఊరి నుంచి వెళ్ళిపోతున్నాననే బాధ. ముఖ్యంగా గౌరీని తలుచుకున్నప్పుడల్లా మతి పిచ్చెక్కినట్లుంటుంది."

"నిజమే, ఈ ఇద్దరి స్నేహం అలాంటిది."

"కాస్త వాడ్ని కనిపెట్టి ఉండండి. వాడు అమాయకుడు. వాడిలో అతి మంచితనం ఉంది. సంఘం అలాంటివాడ్ని విలవనివ్వదు."

అప్పటికే గౌరీపతి స్థితి కొంచెం మారింది. అతని ముఖంలో చీకటి క్రమ్ముకుంటున్నది. "విశ్వం వెళ్ళిపోతున్నాడు" ఈ మాటలే అతని నరాల్లో ధ్వనిస్తున్నాయి. ఆగి ఆగి అతని కళ్ళలో నీరు గూడుకడుతున్నది.

పిచ్చి గౌరీపతి! ఎందుకింత ప్రేమ, మమకారం విశ్వంమీద ?

"అసలా విశ్వంమీద కాదండి, మోహినిమీద." మాధవరావు నా చెవిలో జోరీగలాగ గొణిగాడు.

ఏదైనా ఈనాడు గౌరీపతిలో ఒక తేజస్సును చూశాను. మనిషి మనిషికి ఉండే అనుబంధాన్ని ఎంతగా ఆరాధిస్తున్నాడో! నా హృదయం అతనియెడ సానుభూతితో నిండిపోయింది. ఎంత విషాదకరమైనదీ వియోగం?

విశ్వం వెళ్ళిపోయే రోజున గౌరీపతి మరీ దిగజారిపోయాడు. ఒకరి ఆనందాన్ని గాని, దుఃఖాన్నిగాని మరొకరు అనుభవించలేరుగాని, నేను అతని హృదయ స్పందనాన్ని అంచనా వేశాను. కాలచక్రంతో సమంగా స్పందించింది అతని హృదయం.



గౌరీపతితోపాటు మేము స్టేషన్‌కి వెళ్ళాము

"వె....ళ్ళొ....స్తా....ను..." అంది మోహిని రెండు చేతులు జోడించి.

అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"మంచిది. నీ అన్వేషణకి, నిరీక్షణకి అంతం లభించినప్పుడు నన్ను గుర్తు చేసుకో —"

మోహిని బాధగా నవ్వింది.

"మిమ్మెలా మర్చిపోగలను? నాకు దారి చూపింది మీరు!"

"ఆరాధన' - పూర్తి చెయ్యి."

"చెయ్యాలి. కాని ఎందుకో నేను 'మీరా'ని కాలేకపోతున్నాను. నా హృదయంలో ఆ వేణుగోపాలుని మురళీరవం స్పష్టంగా వినిపించటంలేదు." అంది అర్ధనిమీలిత నేత్రాలతో అతన్ని చూస్తూ.

"ప్రేమ అంటే మతం. ప్రకృతిని ఆరాధించు. నీ హృదయంలో సౌందర్యముంది. ఆ సౌందర్యంలో ప్రేమ లీనమైనప్పుడే నీవు 'మీరా'వి కాగలవు. ఈ విశాల విశ్వాన్ని ప్రేమించు. నీ ఆత్మలో ఆ ప్రేమను అనుభవించు. ఆ ప్రేమను లోతుగా తీసుకోటమే భక్తి."

"ఎంత గొప్ప నటన." మాధవరావు జోరీగ సంగీతం.

రైలు కూతకూసింది.

"ప్రయత్నించు"

"వస్తాం గౌరి, — దిగులు పడకు. ఆఫీసుపని జాగ్రత్తగా చేసుకో. నేను మళ్ళీ ఇటు రావటానికి ప్రయత్నిస్తాను."

గౌరీపతి నోటమాట రాలేదు.

విశ్వం రైలు కదులుతుంటే "ఉంటా" నని వెళ్ళి ఎక్కాడు.

గౌరీపతిలో ఇప్పటికి చలనం వచ్చింది.

"లీల ఆరోగ్యం జాగ్రత్త. ఉత్తరాలు వ్రాస్తుంటావుగా - విశ్వం - వి....శ్వ...."

రైలు వెళ్ళిపోయింది. అతను పిచ్చిగా రైలువెంట పరుగెత్తి లాభం లేక ఆగిపోయాడు.

నా హృదయం ద్రవించిపోయింది.

క్రమంగా రైలు కనుచూపు మేర దాటేంతవరకు చూస్తూ నిలబడి పోయాడు.

"గౌరీపతి, పోదాం రండి."

తలవంచుకుని యాంత్రికంగా నడిచాడు.

"వెళ్ళిపోయారు. నన్ను విడిచి వెళ్ళిపోయారు. నా కింకెవరున్నారు?"

"మేమంతా లేమా?"

అతను మాట్లాడలేదు.

"సినిమాకి పోదాంరావయ్యా మూర్తి." అన్నాడు మాధవరావు.

"సినిమాకి పోదామా గౌరీపతి"

"మీరు వెళ్ళండి. నా మనస్సేం బాగులేదు."

"అందుకనే పోదామంటున్నాను."

"నన్ను కాసేపు ప్రశాంతంగా ఉండనీండి. ప్లీజ్-"

ఇక చేసేదేం లేక మేము సినిమాహాలువైపు నడక సాగించాము.

"మూర్తి, మీకో విషయం తెలుసా?" అన్నాడు మాధవరావు.

---

ఒకానొక చంద్రబాబు బుచ్చిబాబుతో సూట్‌కేసులమ్మే దుకాణంముందు నిలబడి ఉండగా అన్నాడు.

"నువ్వో సూట్‌కేసు కొనుక్కోరాదు బుచ్చీ!"

"ఎందుకూ?" అని అడిగాడు బుచ్చిబాబు.

"నీ గుడ్డలు పెట్టుకోవచ్చుగా...."

"అంటే నన్ను గుడ్డల్లేకుండా తిరగమనా నీ ఉద్దేశం?" అన్నాడు బుచ్చి.

"విశ్వం కావాలని ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు."

షాక్ కొట్టినట్లయి ఆగిపోయాను

"నిజమా ?"

"అవును. తన హెడ్డాఫీసుకు పోయి ప్రయత్నించి సాధించాడు."

"ఎందుకు?"

"మోహిని - గౌరీపతుల ప్రణయం తెలిసిందేమో ?"

అతనెంతసేపటికి ఒకచే కోణం నించి చూస్తాడు.

"కాని మోహినిలో అలాంటిదేమీ కనపడలేదండి. నా కామె ప్రవర్తనలో లోపం కనిపించలేదు."

"మీరు నోట్లో వేలుపెడితే కొరకలేరని ఊరికే అన్నారా? పదండి."

సినిమా చూస్తున్నా ఒకటే ధ్యాస.

విశ్వం ఎందుకు గౌరీపతికి దూరమైనాడు ?

• • •

మూడు నెలలు గడిచాయి.

ఒక మహాద్భుతమైన సంఘటన జరిగింది. విశ్వం వెళ్ళిపోయిన తరువాత ఇంతవరకు ఒక్క ఉత్తరం కూడ వ్రాయలేదు. అదే విచిత్రం. విశ్వం, గౌరీపతిని పూర్తిగా మరిచిపోయాడని నమ్మకం కలిగింది. కాని గౌరీపతే అతన్ని మరిచిపోలేకపోతున్నాడు. తనంత తనే ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు. వేటికీ జవాబులేదు. మాధవరావుకిది అనుకూల వాతావరణం. అతను రోజురోజుకి కథలు అల్లి ఆనందిస్తూనే వున్నాడు. విశ్వం - గౌరీపతుల స్నేహం కేవలం మోహినివలననే చెడిపోయిందని అతని నిశ్చయం.

కాని గౌరీపతి దీన్ని పట్టించుకోలేదు. మౌనంగా ఊరుకున్నాడు. సంఘం తనని భూతద్దంపెట్టి చూస్తున్నదని అతనికి తెలుసు. అయినా ప్రేక్షకుడిలా చూస్తూ వూరుకున్నాడు.

కాని అతనిస్థితి చూస్తున్నకొద్దీ నాకు భయం వేస్తున్నది. అతను మానసికంగా, శారీరకంగా అలసిపోయాడు. చిగజారిపోయాడు. ఎప్పుడు విచారంగా, ఏదో ఆలోచిస్తు కూర్చుంటాడు. అతని కళ్ళల్లో, ముఖంలో అంతులేని దిగులు. పోస్టుమాన్ వచ్చినప్పుడు మాత్రం అతని కళ్ళు ఆశగా చూస్తయ్. ఉత్తరమేమీ లేకపోయేసరికి నిరాశతో కృంగిపోతాడు. ఈ స్థితి రోజు రోజుకీ ఎక్కువైంది. అతనిలో అంతులేని వేదన. ఇచ్ఛ నశించిపోయింది. ఆకాంక్షలేదు. ఉత్సాహంలేదు. అది కేవలం తనంత తానుగా అమృతం పోగొట్టుకున్న మృణ్మయపాత్ర.

అతన్ని ఎవరు మాత్రం ఓదార్చగలరు?

నాకు గౌరీపతిని చూస్తే జాలి, విశ్వాన్ని తలుచుకుంటే కోపం. అంత ఆప్త స్నేహితుడికి ఒక ఉత్తరంవ్రాసి ఓదార్చలేడా? అంత మానవత్వంలేని క్రూరుడా విశ్వం? స్నేహమంటే అనురాగం. స్నేహంలో ఉండే అనురాగాన్ని మరిచిపోయినాడా? స్నేహంలోఉండే అనుబంధాన్ని తెంచేసుకున్నాడా?

ఏదో యాంత్రికంగా ఆఫీసుకువచ్చి వెళ్ళేవాడు గౌరీపతి. కాని ఏం పని చేసేవాడు కాదు. అసలు అతనిలో పనిచేసే శక్తి నశించిపోయింది. పదిమాటలకి ఒక మాట జవాబు చెప్పేవాడు. అయితే పైకి ఎన్ని అనుకున్నా లోపల అందరికి అతని మీద జాలి, సానుభూతి ఉన్నాయి. అందువల్ల అతను పని చేసినా చేయకపోయినా ఎవరు పట్టించుకొనేవారుకాదు. అదే మేము చేసిన పొరపాటేమో? దానితో అతని పరధ్యానం ఎక్కువైంది. ఈ ప్రపంచంమీద అంతులేని నిర్లక్ష్యం ఏర్పడిపోయింది. అతన్ని ఉన్మాదస్థితి ఆవరించింది. అతని బాధకు అంతులేదు.

ఒక్కోరోజు అతనికి భోజనం చెయ్యాలనికూడ తోచేదికాదు. ఒంటరిగా చీకట్లో గదిలో పడుకొని ఉండేవాడు. నేను వచ్చి లైటువేసి చూస్తే అతని బుగ్గలపైన కన్నీరు చారికలు కట్టి ఉండేది.

అతని మనస్సులోని ఆలోచనల విషాద స్రవంతితో ముఖం పీక్కుపోయింది. అతని కళ్ళలో విరక్తితో కూడిన నిరీక్షణం అతను లోలోపల దహించుకుపోతున్నాడు. నేనతని బాధ చూడలేకపోయాను.

"పోనీ, మీరే ఓసారి వెళ్ళి చూసిరాకూడదూ?" అన్నాను.

అతను చాలసేపు మాట్లాడలేదు. అతని కనుకొలకులలో ముత్యాలబిందువు గూడు కట్టుకుని జారి భూమిపైపడి చితికిపోయింది.

అతను నా వంక ఆశగా, జాలిగా చూశాడు.

తను నెలంతా గడపాలని కూడా ఆలోచించకుండా - చీర కొనటానికి డబ్బిచ్చిన గౌరీపతి- ఎలా దూరం చేసుకోగలిగాడు?

"అవునండి, వెళ్ళిరాకూడదూ?"

చాలాసేపటికి అతని పెదవులు కదిలినాయి.

"అదే ఆలోచిస్తున్నాను."

డబ్బుందా ?"

తల ఊపాడు.

ఒక శనివారం శలవపెట్టి విశ్వం దగ్గరకి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు "ఒకవేళ ఉండమంటే టెలిగ్రాం ఇస్తాను. శలవ పెంచమని. కొంచెం మీరు కూడ ఆఫీసర్‌తో చెప్పండి" అన్నాడు నాతో.

సరే నన్నాను.

కాని వెళ్ళిన మరునాడే తిరిగి వచ్చాడు.

"వెళ్ళారా ?"

"ఆఁ!" అతని గొంతు వణుకుతోంది.

"విశ్వం ఉన్నాడా?"

"ఆఁ!"

"మరి వచ్చేశారేం?"

"ఏముంది. చూసి వచ్చాను."

"ఉత్తరమెందుకు వ్రాయలేదుట?"

"తీరిక చిక్కలేదట."

"మీ రింకా వారం రోజులుంటారనుకున్నాను."

అతను మాట్లాడలేదు. కిటికీలోంచి శూన్యాన్ని చూస్తూ నిలబడ్డాడు.

"గౌరీపతి." ఆప్యాయంగా భుజంమీద చేయివేశాను.

"మీ బాధ తగ్గిందా ?"

అతను విషాదంగా నవ్వాడు.

"బాధేముంది?"

కాని ఆ మరునాడు అసలు గౌరీపతి లేవలేదు. క్రమంగా చమురయిపోతున్న దీపంలా క్షీణించిపోతున్నాడు. అతనిలో ప్రకృతి స్థంభించింది. అతనిలో అనుభూతిలేదు. అది కేవలం ఒక బొమ్మ. అతని హృదయం బలహీనమైపోయింది.

దాని స్పందన మాకు వినపడదు మేము విడదీయలేనంతగా అతని జీవితం ముడి బిగుసుకుంది. అందుకే అతని మాట అర్థం కావటంలేదు. అతని బాధ నర్థం చేసుకోలేకపోతున్నాం.

అతను చైతన్యరహితంగా మిగిలి పోయాడు.

మాధవరావు మాత్రం అతని స్థితి చూసి "విశ్చయంగా ఇది మోహిని దయ్యపు పనే." అనేశాడు.

• • •

హఠాత్తుగా వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం విని కళ్లు తెరిచాను.

బెడ్‌రూం లైటు వెలుగులో ఏదో చూస్తూ ఏడుస్తున్నాడు గౌరీపతి. ఆశ్చర్యంగా లేచి కూర్చున్నాను. కాని నా వివేకం పని చేసింది. కనీసం ఇప్పుడయినా అతని బాధ తెలుసుకోగలిగితే?

పడుకున్నాను.

"నీకు జాలిలేదూ? నా బాధ నీకు తెలీదూ? ఇంకా ఎంతకాలం ఇలా జీవితమంతా కాల్చే. నిరాశా స్వప్నాలతో - ఏడుస్తూ బ్రతకను? లాభంలేదు. నే నిక వటించలేను. మనం అనుకున్నం అమాయకులాలు కాదు సంఘం. నేను దానికి దొరికిపోయాను. అయినాసరే, నేను చేస్తున్నది పాపమని తెలిసినా, ఆ పాపాన్ని భరించటానికి కూడా సిద్ధపడ్డాను. నన్నెందుకు ఆకర్షించావు? కవ్వించావు? నా కలలు నీ చుట్టూ తిప్పుకున్నావు!"

అతను కళ్లు తుడుచుకున్నాడు. గుడ్డి వెలుగు జాలిగా అతన్ని చుట్టుకుంది.

"ప్రేమ దేనికి? దైవత్వాన్నందించటానికి - హృదయంలోచేరి దహించటానికి. ఇప్పుడు అంతే. విఫలమైన ప్రేమ విషమయింది. నా కెక్కడ చూసినా ఎడారితప్ప పచ్చని ప్రకృతి కనిపించటం లేదు. ఈ ప్రకృతికి నా మీద కసి, నువ్వు నా పక్కన లేవని ఈ రాత్రి ఎంత సంతోషిస్తున్నదో చూడు."

గౌరీపతి ముఖం దీపాలారిన ఇల్లులా అయింది.

"ఎందుకు నిన్నిట్టా ప్రేమిస్తాను? ఎందుకు? అసలు ప్రేమించకపోతేనేం? ఎందుకు మరిచిపోలేను నిన్ను? ఈ రాత్రి నిద్రపట్టక నీ ఫొటో చూస్తుంటే ఏడుపొచ్చింది. కనీసం నేను గుర్తయినా ఉన్నానా నీకు? నువ్వు నా కందవని తెలిసినా ఇంకా ఎంత ప్రేమ నువ్వంటే? ప్రేమ ఇచ్చిన బహుమతివి నువ్వు. నువ్వు స్త్రీని కావు. అనుభవానివి. నీ ప్రేమలో నా అహం చనిపోయింది. నాకు 'నేను' 'నువ్వు' అనే భేదంలేదు. నిజానికి ప్రేమించటంకన్నా ప్రేమించబడటం సొంత అదృష్టం. ఈ అదృష్టాన్ని నేనే చేతులారా పోగొట్టుకున్నానా? నువ్వు ప్రకృతికి సరిహద్దువి. నేను నీ దగ్గరకి రాలేకపోతున్నాను. నువ్వు లేకుండా నేను జీవించలేను. నా అనుభవం సంపూర్ణం కాలేదు. అందుకే నా నిరీక్షణకి అంతు దొరకటం లేదు. నీ కోసరం చేతులు చాచి, అందుకోలేక, శూన్యమైన అనుభవంతో ఒంటరిగా మిగిలిపోయాను. కాని ఒకటి మాత్రం నిజం. నీతో నా అనుభవం ఆధ్యాత్మికమైంది!"

ఈ గది నాలుగు గోడలు అతని విషాద కథను జాలిగా వింటున్నాయి. అతను మౌనంగా దాచుకున్న బాధను ఈ రాత్రి బయటపెట్టింది. కాని అతను ప్రేమించిం దెవరిని? మోహినినా?

ఆ గుడ్డి వెలుగులో, శాంతంలో, లీలగా లీనమై పోతున్నాడు గౌరీపతి.

"నాకు నీతో ప్రేమ జీవితం అయింది. నువ్వు వెళ్ళిపోయావు. నా జీవితం అంతమైపోతోంది. నేనెన్నాళ్ళో ఈ బాధను భరించలేను నువ్వురావు. నన్ను రానీవు. మనిద్దరిమధ్యా సంఘపు ఉక్కుగోడలున్నాయి. గతంలోని నా ఆనందం ఈ నాడు మహా భయంకరమైన అగ్ని అయి నన్ను దహింప చేస్తున్నది. నా ఆత్మ కాలిపోతున్నది."

అతను ఆవేశంతో చేతిలోని ఫొటోని ముద్దు పెట్టుకున్నాడు.

"భగవాన్, ఇదెంత శిక్ష!"

గౌరీపతి దుఃఖమాపుకోలేక బావురుమని ఏడ్చాడు.

"హఠాత్తుగా నా అన్వేషణ మధ్యలో ఆగిపోయింది. నేనిక ఈ ప్రేమస్మృతితో ఎలా బ్రతకను? నిజానికి నీకు నాకు భేదం




లేదు. మన మనస్సులు, ఆత్మలు అంతగా కలిసిపోయినయి. నా ఆశలు, కోరికలు, ఆనందం నీ లో నిండి పోయినయి. నువ్వు వెళ్ళిపోవటంతో నాలో తీవ్రమైన శూన్యం నిండుతోంది. ఆ నాటి మనపాట గుర్తుందా?- నువ్వూ నేనూ కలిసి పువ్వులో తావిలా...."

ఇంత వ్యథని దాచుకుని ఎలా జీవించగలుగుతున్నాడు? ఇక పడుకోలేక పోయాను.

"గౌరీపతి." అన్నాను.

అతను సజల నేత్రాలతో నా వంక చూసి చప్పున ఫొటో దాచేశాడు.

"నాతో నిజం చెప్పండి. మీ రెవర్ని ప్రేమిస్తున్నారు?"

అతను జవాబు చెప్పలేదు. కళ్లుతుడుచుకున్నాడు.

"గౌరీపతి, ప్లీజ్, ఎవర్ని ప్రేమిస్తున్నారు?"

అతను దీనంగా నా వంక చూశాడు.

"నాకు ప్రేమంటే ఏమిటో తెలియదు."

"గౌరీపతి, నేను మీ బాధను పంచుకోలేను. మీ అనుభవంమీది. కాని మిమ్మల్ని

ఓదార్చగలను? మీరిలా కృంగి కృశించి పోతుంటే నే నెంత బాధపడుతున్నానో తెలుసా? నిజం చెప్పండి. వీలయితే.''

"నిజం చెబుతున్నాను. విశ్వం గుర్తు వచ్చాడు. ఏదో పిడికల వచ్చింది. దానితో బాధ వేసింది. కళ్ళవెంబడి నీళ్ళు వచ్చాయి.

నే విన్నాళ్లూ అతని బాధ విశ్వం కోసరమే ననుకున్నాను. కాని ఈ క్షణంలో క్రొత్త గౌరీపతి ప్రత్యక్షమైనాడు.

"ఆ ఫోటో ఎవరిది?"

అతను నిర్ఘాంతపోయాడు.

"చూశారా?"

"లేదు. చూస్తే మిమ్మల్నీ ప్రశ్న అడిగేవాణ్ని కాదు. స్వయంగా వివాహానికి ఒప్పించేవాడిని."

అతను భారంగా నిట్టూర్చాడు.

"పోనీ ఆమె ఎక్కడుంటుందో—"

విషాదం నిండినకళ్ళతో నా వంకచూశాడు.

"నన్ను నమ్మరా?"

"నమ్మతాను. కాని మీ బాధను చూడలేక పోతున్నాను. మీ రెవర్నో ప్రేమిస్తున్నారు. అది మటుకు నిజం. ఒక నిజమైన స్నేహితుడిగా అడుగుతున్నాను. ఎవరా స్త్రీ?"

"అతనిక తట్టుకోలేకపోయాడు. ఏడుస్తూ నాహృదయంమీద వాలిపోయాడు. నా హృదయం అతని కన్నీటితో తడిసిపోయింది. "గౌరీపతి'' ఆప్యాయంగా దగ్గరకు లాక్కున్నాను. "ఆమె ఎవరు?'' అతను ఏడుస్తూనే ఆకాశంలోకి చూపించాడు. అక్కడ ఒక నక్షత్రం మిలమిలా మెరుస్తున్నది.

• • •

గౌరీపతి స్థితి మరింత విషమించింది. ఆఫీసుకు రావటం మానేశాడు. అతనిలో మనోవ్యాధి పరకాష్ఠనందుకుంది. ఎప్పుడూ ఏకాంతంలో పడుకుని ఉంటాడు ఏదో ఆలోచిస్తూ. అప్పుడప్పుడు అతని కళ్ళు చెమర్చేవి. ఉండుండి వేదాంతిలా తనలో తను నవ్వుకునేవాడు. ఎవరైనా పిలిస్తే జాలిగా కళ్ళు తెరిచి మళ్ళీ మూసుకునేవాడు.

ఇది తపస్సా?

నేనే ఊరుకోలేక డాక్టర్ని తీసుకువచ్చి చూపించాను.

"అతన్ని గురించి మీకేమైనా తెలుసా?" అన్నాడు డాక్టర్.

"అంటే?"

"అతనికి మనోవ్యాధి. మనోవ్యాధికి, మనిషి కాటుకు మందులేదు_"

నేను నిట్టూర్చాను. డాక్టర్ వెళ్ళిపోయాడు.



"విన్నారా, డాక్టరేం చెప్పాడో?''

నిట్టూర్చాడు.

''ఎందుకు మీజీవితాన్ని నాశనం చేసుకుంటారు?''

"——"

"మనిద్దరం స్నేహితులం. ఒకే గదిలోఎన్నో రోజుల్నించి వుంటున్నాం. ఎవర్ని మీరు ప్రేమించింది? ఆరోజు ఆకాశంలోకి చూసారు. అంటే ఆమె లేదు.''

''మూర్తీ - నన్ను ఏకాంతంగా వుండనీండి. వెళ్ళిపొండి.''

''ఊహుం. మీ బాధ నా హృదయంలో సంచలనాన్ని రేపుతోంది. మిమ్మల్ని మీరు ఇలా క్రొవ్వొత్తిలా దహింపచేసుకుంటుంటే వూరుకోలేను. ప్లీజ్_''

''ఇంకా ఎన్నాళ్లో ఉండదులేండి.''

''గౌరీపతీ!'' షాక్ తిన్నాను.

''బాధపడుతున్నారా? మీ బాధ చూస్తుంటే నాకు బాధగానేవుంది. కొందరు పుట్టుకతో చరిత్రహీనులౌతారు. వారిని మర్చిపోవటం మంచిది. ఇప్పట్నించి నన్ను మరిచిపోండి. లేకపోతే ముందు ముందు నేనో క్షుద్ర జ్ఞాపకాన్ని కావచ్చు'' అన్నాడు జాలిగా, దీపంచుట్టూ ఆశగా తిరుగుతున్న కీటకాన్ని చూస్తూ పడుకున్నాడు.

''మీరు ప్రేమించింది మోహినినా?''

ధైర్యంచేసి అడిగాను. తీరా అడిగాక ఎందు కడిగానా అనుకున్నాను. ఆమెకి అతనికిఉన్న సంబంధం లీలగా నా ఆత్మలో మెదిలింది. అతను నిట్టూర్చాడు.

''మోహినినెవరు ప్రేమించరు? ఆమే ప్రేమ. ప్రేమకి నిర్వచనమే అమె. మోహిని పవిత్రురాలు. ఆమెను మామూలు మన దృష్టితో చూడటం పాపం.''

''మళ్ళీ శేష ప్రశ్న.

''నన్ను క్షమించండి.''

అతను ఆప్యాయంగా నా చెయ్యి నొక్కాడు.

''మీకెలా బాగలేదని విశ్వానికి ఉత్తరం వ్రాస్తాను.''

అతను మాట్లాడలేదు.

ఆ మరునాడే ఉత్తరం వ్రాశాను. కాని నెలరోజుల తరువాత నా ఉత్తరానికి జవాబు వచ్చింది.

''డియర్ మూర్తి,

మీ ఉత్తరం అందింది. మా లీల ప్రసవించింది. మగ పిల్లవాడు పుట్టాడు. మన వాళ్ళకి ఈ విషయం చెప్పండి.

విశ్వం''

గౌరీపతి ప్రసక్తే లేదు.

నాకు విశ్వాన్ని నమిలిమింగేయాలన్నంత కోపం వచ్చింది. మానవత్వాన్ని దారుణంగా హత్య చేశాడు.

ఆఫీసునుంచి సరాసరి గదికొచ్చాను. అతను కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

"గౌరీపతి"

బలహీనంగా కళ్లు తెరిచాడు.

"విశ్వం ఉత్తరం వ్రాశాడు.''

పెరిగిన గడ్డంలోంచి ఆశగా చూశాడు.

"కొడుకు పుట్టాడుట.''

అతని ముఖంలో ఆనందం మెరుపులా రేఖా మాత్రంగా మెరిసి మాయమైంది.

• • •

అనుకోకుండా కేంప్ కి వెళ్ళవలసి వచ్చింది. మూడు రోజుల తరువాత తిరిగి వచ్చాను.

"సార్, అయ్యగారు వెంటనే రమ్మన్నారు." అంటూ వచ్చాడు ప్యూన్.

"ఎందుకు!" అన్నాను చిరాకుతో.

"ఏమో! వెంటబెట్టుకు రమ్మన్నారు."

"సరే పద."

నేను వెళ్ళేసరికి ఆయన విచారంగా కూర్చుని వున్నారు.

"మూర్తి, గౌరీపతి ఆత్మహత్య చేసుకున్నాడు."

నిర్ఘాంతపోయాను. నా హృదయ స్పందన ఒక్కసారి ఆగిపోయింది!

"నిజంగానా?"

"అవును - ఇంతకుముందే. శవాన్ని హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు. మన వాళ్ళంతా అక్కడే వున్నారు. అతని కెవరైనా వున్నారా?"

నా కళ్ళు జలపాతాలైనయి.

"ఎవరూలేరు. అతని ఆప్తుడు విశ్వమే. అతనికే టెలిగ్రాం ఇస్తాను." అన్నాను ఏడుస్తూ.

ఆఫీసరుగారి దగ్గిర శలవు తీసుకుని హాస్పిటల్‌కి పరుగెత్తాను. శవాన్ని పోస్టు మార్టమ్‌కి స్ట్రెచర్ మీద పంపుతున్నారు. మెల్లగా సమీపించి వణుకుతున్న చేతులతో పైన కప్పిన దుప్పటి తొలగించాను.

ధ్యానమగ్నమైనట్లుగా నిశ్చలంగా వున్నాడు. అతనిలో చలనంలేదు. జీవ సంచలనంలేదు. అనంత యాత్రాపథలో ఇదొక మజిలీ. అతని జీవితపు వాకిళ్లు మూసుకున్నాయి. అవి ఇక తెరుచుకోవు. ఆ శూన్య జీవన గృహంలో ఆకాంక్షలు, ప్రేమ, కోరికలు, ఆనందం — వీటిని చుట్టిన భయంకరమైన దుఃఖం ఒకదానిలో ఒకటి అంతర్లీనమైపోయినయి. అతని హృదయం పొగజారిపోయింది. అతనిది సముద్రపు అగాధము. అంత బడబానలాన్ని భరించికూడ కన్నీటితో ఆర్పటానికి ప్రయత్నించాడు. అతని ముఖంలో అసంపూర్ణమైన అనుభవంలో సంపూర్ణత్వం, అసంతృప్తిలోనే ఒక తృప్తి. కన్నీటిలోనే ఆనంద బాష్పం, నిర్లిప్తత, ప్రసన్నత — అతని ఎండిపోయిన పెదవులపై శుష్కమందహాసం ప్రకృతిని పరిహసిస్తున్నది. కన్నీటితో అతుక్కుపోయినయి కనురెప్పలు. ఈ దీర్ఘ సమాధిలో అతని ప్రేమ నిద్రపోతున్నది. అర్ధగానమైన ఆ రాత్రి అతని ముఖంలో ప్రతిఫలిస్తున్నది.

"గౌ-రి-ప-తి!" గద్గద స్వరంతో పిలిచాను.

అతను జాలిగా చూడలేదు. ఏడుస్తూ హృదయాన్ని విప్పలేదు. ఆ అధ్యాయం ముగిసింది. ఇక అతనిలో ఎలాంటి 'ఇన్స్పిరేషన్' రాదు. అతని ముఖంలో గొప్ప భావుకత. ఆఖరికి దేవతని ప్రత్యక్షం చేసుకున్న తృప్తి. ఈ ఓటమి తనకు అపజయంకాదన్న నిర్లక్ష్యం, తన లక్ష్యాన్ని పరోక్షంగా చేరుకున్నా నన్న గర్వం, రూపురేఖలు దిద్దుకున్నాయి. ఇన్నాళ్ళ అతని గాఢ తపస్సుకు ఈ 'నిశ్శబ్దం' పరమై అతన్ని తనలోకి తీసుకుని ఓదార్చింది.

మా టెలిగ్రాంకి కూడ జవాబులేదు. మరునాడు మేమందరం చందాలు వేసుకుని గౌరీపతి అంత్యక్రియలు జరిపాము.

ఈ విరాట్పురుషుని పాద స్పర్శచేత పులకితురాలైన శ్మశానం. ఆ శ్మశాన సుందరి నుదుట ఎర్రని బొట్టులా వుంది అతని చితి.

అతన్ని తలచుకుంటూ దూరంగా నిలబడ్డాను. ప్రకృతి ఊపిరి బిగబట్టింది. నాలో చైతన్యం విలుప్తమౌతున్నది. ఈ భూమ్యాకాశాల నడుమ మౌనం ఆవరించుకుంది. మానవులు లేపలేని దీర్ఘనిద్రలో అతని ఆత్మ అస్తిత్వాన్ని అనుభవిస్తున్నది.

ఎప్పటినుంచి ఈ తపస్సు? ఏమిటీ నిశ్శబ్దం?

ఉన్నట్లుండి అతని మౌనంలోంచి దివ్య సంగీతం వినిపించింది. ఈ మరణం అందమైనది. కాని దురదృష్టకరమైనది. మృత్యువు అతన్ని స్పర్శించి తన శీలాన్ని పోగొట్టుకుంది. అతని వేదనకి స్వరం లేదు.

"పిచ్చి గౌరీపతి, పాపం మరణించాడు." అన్నట్లుగా వున్నాయి ఎవరి ముఖం చూసినా, అందరిలో శ్మశాన వైరాగ్యం పేరుకుపోతున్నది. నిశ్శబ్దంగా ఆఫీసర్‌గారు చితిని సమీపించి తెలు రుమాలాలలో తెచ్చిన పూలు దానిమీద చల్లారు. చెమర్చిన కళ్ళతో దానివంక చూసి కలవరించుకు వెళ్ళిపోయారు.

"ఇంత మంచివాడ్ని మోహిని పిశాచం మింగేసిందయ్యా" మాధవరావు గొణుక్కున్నాడు.

"గౌరీపతి లేనప్పుడు ఇంకా మోహిని ఎక్కడ?" అనుకున్నాను. మాధవరావు ఆర్ద్రములైన కళ్ళను తుడుచుకుని ముఖం మరోవైపుకి త్రిప్పుకున్నాడు.



"లవ్ ఇన్ ఇట్సెల్ఫ్ ఈజ్ ఎ స్పిరిట్యుయల్ ఫైర్" అన్న వాక్యం గుర్తొచ్చింది.

నాటి అర్ధరాత్రి నిద్రలేక వెక్కి వెక్కి ఏడుస్తున్న అతని కళ్ళు కనిపించవు. నా హృదయంలో ఆ రాత్రికి అంతంలేదు. సంవత్సరాల మూగవేదనకి, చీకటిలో శూన్యంలో అతని అన్వేషణకి గమ్య స్థానం ఇదా?

అగ్నిహోత్రుడు విజృంభించాడు. మండుతున్న అతనిహృదయంలో ప్రేమని చల్లబరిచాడేమో? భగవంతుని రహస్యమైన ఉనికి అతనిలో నిద్రలేచి చిరునవ్వు నవ్వింది. అతని ఆత్మలో అంతర్లోకాలు తెరుచుకున్నయ్యేమో? మరో మహత్తరమైన జీవితం ప్రారంభించటానికి ఇది నాందియేమో!

విషణ్ణ మనస్కురాలైన ఒక మబ్బు ఈ విషాదవార్త విశ్వానికి చెప్పటానికి పరుగెత్తిపోతున్నది.

దైన్యవదనాలతో గృహోన్ముఖులమైనాము. అతని మరణానికి కారణభూతురాలైన ఆమె ఎవరో తెలుసుకోవాలనిపించింది. తాళం పగలగొట్టి పెట్టె తెరిచి ఆ ఫొటోకోసరం వెదికాను. ఫొటో నాకెక్కడా కనిపించలేదు. ఒక కవర్లో ఆ ఫొటోని తగలబెట్టగా మిగిలిన బూడిద కనిపించింది. దానిలో రెండు పారిజాతాలు వాడిపోయి వున్నయి. ఆ కవరుపైన 'ప్రేమతో గౌరీపతికి'అని వుంది. ఆ పెట్టె అడుగున - ఏదో పాకెట్ - విప్పిచూశాను. ఆరాధన - మోహిని పూర్తిచేసిన చిత్రం. గౌరీపతికి అంకితం చేసింది! ఆమెలో కళ పరిపూర్ణమైంది!

"గౌ-రీ-ప-తి" మరోసారి నా కళ్ళు జలపాతాలైనయి. అతన్ని మరిచిపోలేకపోతున్నాము. ఆఫీసుకు రాగానే అతని

సీటులో కూర్చుని పనిచేసే సుదర్శనాన్ని చూసేసరికి మనస్సు చివుక్కుమనేది

అతను కలలతోనే బ్రతికాడు. దానిని వ్యక్తీకరించలేక పోయాడు. అతని జీవితం ఎలా వ్యర్థమైనాదో ఖాళీ అయిన అతని గది చెబుతుంది. ఆ గదిలో ఇంకిపోయిన అతని కన్నీరు నా హృదయంలో చేరి అతని విషాద చరిత్రను చర్విత చర్వణం చేస్తూనే వుంటుంది. అతనికి అనుభవించటానికి వ్యక్తిగత జీవితం. లేదు అదంతా ఎడారి. అంతులేని శూన్యం!

మాలో ఏదో వెలితి. మాధవరావు కూడ అప్పుడప్పుడు ఆ సీటువంక చూసి "పూర్ ఫెలో" అని నిట్టూర్చేవాడు.

మా కెవరికీ ఆమెని గురించి తెలీకుండా జాగ్రత్త పడ్డాడు.

ఆఖరికి ఆమె ఫోటోనికూడా తగల పెట్టాడు. అందుచేత ఆమె మాకజ్ఞాతంగానే వుంది. ఇప్పుడెక్కడున్నదో! పెళ్ళి చేసుకుందో ?

♦ ♦ ♦

కంచికిపోయె ఈ కథ హఠాత్తుగా ఆగిపోయింది. అలా ఆపినవాడు డాక్టర్ రమణారావు. అతను నా చిరకాల మిత్రుడు. చాల రోజులక్రితం ఈ వూళ్ళో డాక్టర్‌గా పని చేశాడు.

"ఏమిటయ్యా బాబు, ఎక్కడా గది దొరకలా? ఇక్కడ గౌరీపతి వుండేవాడు కదూ?" అన్నాడు.

"గవురీపతి నీకు తెలుసా?'' అన్నాను.

"నాకు, నీలాగే ఆప్తమిత్రుడు."

"పాపం! అతను ఆత్మహత్య చేసుకున్నాడు."

అతని విషాద చరిత్ర చెప్పాను,

"అప్పుడే అనుకున్నాను. ఈ కాలంలో పుట్టాల్సినవాడు కాదని. అమాయకుడు తెల్లనివన్నీ పాలు. నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మేరకం "

''కాని పిటీ ఏమిటంటే అతనికి ఆఖరి రోజులలో కూడ విశ్వం దగ్గరనుంచి సానుభూతి లేకపోవటం." రమణ నిట్టూర్చాడు.

"అతను ప్రేమించిందెవర్ని?"

"అదే తెలియదు. అతను ఎవరికీ చెప్ప లేదు. విశ్వానికైనా తెలుసో తెలియదో?'

''కొందరు దురదృష్టవంతులుంటారు, అది సరేగాని, విశ్వం లేడా ఇక్కడ? ఇంతకీ అతనికి మామగారి ఆస్తి వచ్చిందా ?''

రమణారావు గొంతులో వ్యంగ్యం ధ్వనించింది.

నిట్టూర్చాను.

''విశ్వం ఎక్కడో కర్నూలవతల ఉంటున్నాడు. గవురీపతి పోయాక విశ్వం సంగతి ఎవరూ తలవటంలేదు. మామగారి ఆస్తి ఏమిటి?''

''నీకు తెలీదా? విశ్వం ఒకప్పుడు బాగా చెడిపోయాడు. అది చూసి లీల తండ్రి స్వార్జితమైన తన ఆస్తినంతా లీలకి సంతానం కలిగితేనే విశ్వానికి చెందుతుందని వ్రాసి చనిపోయాడు.

''అయితే వచ్చే వుంటుంది. విశ్వానికో కొడుకు.''

రమణారావు భ్రుకుటి ముడిచాడు.

''ఇంపాసిబుల్.''

"ఏమిటి ?''

''విశ్వం పురుషుడు కాదయ్యా''

●□●


Hearty Deepavali Greetings :

**PIONEER AUTOMOBILES**

Head Office :

**Congress Office Road — VIJAYAWADA-2**

Grams : 'AUTOMOBILE' P. B. No. 352

Phones : Office : 3844

Res : 4414

★

Branch :

Raja Rammohanaroy Road

VISAKHAPATNAM-1

Phones : Office : 2224 - Res : 2242